జాతీయ స్థాయి ఎస్‌జీఎఫ్ ఖోఖో పోటీలకు ఎంపిక

శామీర్‌పేట, డిసెంబర్ 18 : జాతీయస్థాయి ఎస్‌జీఎఫ్ ఖోఖో క్రీడా పోటీలకు తూంకుంట జడ్పీహెచ్ఎస్ విద్యార్థులు ఎంపికయ్యారు. బుధవారం పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎంపికైన విద్యార్థులను పీఈటీ గుర్రం సత్తిరెడ్డి అభినందించారు. ఈ సందర్భంగా పీఈటీ మాట్లాడుతూ.. క్రీడల్లో ఉత్తమ ప్రతిభను కనబరిచినప్పుడే విజయాలు సొంతమవుతాయన్నారు. ఇటీవల తాండూర్‌లో జరిగిన 68వ రాష్ట్ర స్థాయి పాఠశాల ఖోఖో అండర్-17 బాలుర విభాగంలో జడ్పీహెచ్ఎస్ తూంకుంట పాఠశాల విద్యార్థులు కృపాశేఖర్ (9వ తరగతి), ఆదిత్య (8వ తరగతి) ఉత్తమ ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. ఈనెల 21 నుంచి 24 వరకు అయోధ్యంలో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో వారు పాల్గొంటారని పేర్కొన్నారు. అనంతరం విద్యార్థులను ఉపాధ్యాయులు, తోటి విద్యార్థులు అభినందించారు.

నిధులు మంజూరు చేయాలని జడ్పీకి వినతి

మల్లాపూర్, డిసెంబర్ 18 : డివిజన్ పరిధిలోని పలు కాలనీల్లో అభివృద్ధి పనులపై ఈస్ట్ జోన్ జోనల్ కమిషనర్ హేమంత కేశవ పాటిల్‌కు బుధవారం కార్పొరేటర్ పన్నాల దేవేందర్‌రెడ్డి వినతిపత్రం అందజే శారు. డివిజన్ పరిధిలోని కేఎల్‌రెడ్డి నగర్, ఎస్వీ నగర్, బ్రహ్మపురి కాలని, గ్రీన్‌హిల్స్, గోకుల్‌నగర్ కాలనీల్లో సీసీ రోడ్లు, అదే విధంగా వివిధ పార్కుల్లో ఓపెన్ జిమ్‌ల ఏర్పాటుకు నిధులు మంజూరు చేయాలనికోరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకుడు ఫైళ్ల ప్రవీణ్, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రపతి నిలయంలో మరిన్ని వసతులు

- సందర్శకులకు మరింత ఆహ్లాదాన్నిపంచేలా చర్యలు
- వ్యవసాయ మంత్రిత్వశాఖ జాయింట్ సెక్రటరీ ప్రవీణ్‌కుమార్

మేడ్చల్ కలెక్టరేట్‌లో అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న భారత వ్యవసాయ మంత్రిత్వశాఖ జాయింట్ సెక్రటరీ శ్యామ్యుల్ ప్రవీణ్‌కుమార్

మేడ్చల్ కలెక్టరేట్, డిసెంబర్ 18 : రాష్ట్రపతి నిలయానికి విచ్చేసే సందర్శకులకు మరింత ఆహ్లాదాన్ని పంచే దిశగా చర్యలు తీసుకుంటున్నామని భారత వ్యవసాయ మంత్రిత్వశాఖ జాయింట్ సెక్రటరీ శ్యామ్యుల్ ప్రవీణ్‌కుమార్ పేర్కొన్నారు. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టరేట్ వీసీ హాల్‌లో బుధవారం ఆయన అధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రపతి ప్రతి ఏటా శీతాకాల విడిది ముగించుకుని వెళ్లిన అనంతరం రాష్ట్రపతి నిలయాన్ని ప్రజలు సందర్శించేందుకు అనుమతి ఉంటుందన్నారు. ఈ సంవత్సరం నుంచి సందర్శన కార్యక్రమాన్ని 'ఉద్యాన ఉత్సవ్' పేరుతో మరింత ఆహ్లాదకర వాతావరణంలో స్టాల్స్, చిన్న చిన్న కుటీరాలను ఏర్పాటు చేసి ఒక పిక్నిక్ స్పాట్‌గా తయారు చేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు. వ్యవసాయ, సంస్కృతిక, టూరిజం శాఖల సమన్వయంతో వ్యవసాయంపై ప్రజలకు అవగాహన కల్పించేలా కుటీరాలు, స్టాళ్లు ఉండాలని సూచించారు. వసతిగృహ విద్యార్థులను రాష్ట్రపతి నిలయానికి తీసుకురావాలని, ఉద్యాన ఉత్సవ్‌ను ప్రజలు తిలకించేలా ప్రచారం చేయాలని అధికారులకు సూచించారు. సమావేశంలో కలెక్టర్ గౌతమ్, అగ్రికల్చర్ డైరెక్టర్ సరవనన్ రాజ్, జాయింట్ సెక్రటరీ ఉదయ్‌కుమార్, జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి, అర్బి కల్చర్ అధికారి శ్రీధర్, డీఈఓ విజయకుమారి, ఇతర జిల్లా అధికారులు పాల్గొన్నారు.

కేసీఆర్ పాలన స్వర్ణయుగం

- మాజీ మంత్రి, మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి

3వ డివిజన్‌లో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి

పీర్జాదిగూడ, డిసెంబర్ 18 : తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ పాలనలో అన్ని వర్గాలకు సమన్యాయం, బంగారు తెలంగాణ ఏర్పాటు దిశగా అడుగులు పడ్డాయని మాజీ మంత్రి, మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి అన్నారు. బుధవారం పీర్జాదిగూడ నగరపాలక సంస్థ పరిధిలో రూ. 4 కోట్ల నిధులతో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు స్థానిక మేయర్ అమర్‌సింగ్‌తో కలిసి ఆయన శంకుస్థాపన చేశారు. 2,3,5,6,14 డివిజన్లలో చేపట్టిన అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ, సీసీరోడ్లు, హెల్త్ సెంటర్ పనులను త్వరగా పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని ఆయన సంబంధిత అధికారులను ఆదేశించారు. మాజీ సీఎం కేసీఆర్ పాలన స్వర్ణయుగమన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, టీపీసీసీ ఉపాధ్యక్షుడు వజ్రేశ్‌యాదవ్, డిప్యూటీ మేయర్ శివకుమార్‌గౌడ్, కార్పొరేటర్లు, మున్సిపల్ అధికారులు, కాంగ్రెస్ నాయకులు, కాలనీవాసులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

కార్యక్రమంలో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీలత

మేడ్చల్, డిసెంబర్ 18 : సమాజంలో రోజురోజుకు సైబర్ నేరాలు పెరిగిపోతున్నాయని, సైబర్ నేరగాళ్ల బారిన పడకుండా అప్రమత్తంగా ఉండాలని మైసమ్మగూడలోని సెయింట్ పీటర్స్ ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీలత విద్యార్థులకు సూచించారు. కళాశాలలో బుధవారం ఎన్ఎస్ఎస్ క్లబ్ ఆధ్వర్యంలో సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. సైబర్ మోసాలకు అమాయక ప్రజలకే కాకుండా ఉన్నత స్థాయి వ్యక్తులు సైతం బలవుతున్నారన్నారు. సైబర్ నేరాలను అరికట్టాలన్నారు. సైబర్ క్రైమ్ వలంటీర్ శశి మాట్లాడుతూ.. డిజిటల్ అరెస్ట్ అనేది లేనే లేదని, లేనిది ఉన్నట్టుగా సైబర్ మోసగాళ్లు చిత్రీకరిస్తున్నారని, మ్యూల్ అకౌంట్స్‌కు డబ్బును మళ్లీస్తూ మోసాలకు పాల్పడుతున్నారని తెలిపారు. కొరియర్ పార్సల్‌లో డ్రగ్స్ వచ్చాయని, వాటి నుంచి రక్షణ పొందడానికి ఆధార్ నెంబర్, బ్యాంక్ అకౌంట్ ఇవ్వాలని కోరతారని పేర్కొన్నారు. వీడియోకాల్ ద్వారా పోలీసులు విచారణ చేయరని తెలుసుకోవాలన్నారు. ఏదైనా తెలియని లింక్స్, ఎస్ఎంఎస్, ఈమెయిల్, వాట్సాప్ ద్వారా వస్తే క్లిక్ చేయవద్దన్నారు. ఏపీకే ఫైల్ ఓపెన్ చేస్తే డివైస్ హ్యాక్ అయిపోయి బ్యాక్ అకౌంట్స్, ఆధార్ డిటేయిల్స్ అన్ని హ్యాకర్ చేతికి వెళ్తాయన్నారు. ఎవరైనా సైబర్ నేరగాళ్ల బారిన పడితే 1930కు కాల్ చేయాలని సూచించారు. అనంతరం సైబర్ నేరాలను పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. కార్యక్రమంలో కళాశాల కార్యదర్శి టీవీ రెడ్డి, సైబర్ క్రైమ్ సీఐ సుధీర్‌కృష్ణ, పీఆర్వో రవి సుధాకర్, ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్ డాక్టర్ రాజేశ్వర్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

23న వ్యాస రచన పోటీలు

తెలుగు యూనివర్సిటీ, డిసెంబర్ 18: తెలంగాణ సిటిజన్స్ కౌన్సిల్ ఆధ్వర్యంలో రతన్ టాటా జయంతిని పురస్కరించుకుని నాంపల్లి ఎగ్జిబిషన్ మైదానంలోని సరోజినీ నాయుడు వనితా మహావిద్యాలయం ఆవరణలోని ఎంబీఏ బ్లాక్‌లో ఈ నెల 23న తెలుగు, ఆంగ్లం, హిందీ, ఉర్దూ భాషల్లో ఎంబీఏ విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహిస్తున్నట్లు ఆ సంస్థ అధ్యక్షులు డాక్టర్ రాజ్‌నారాయణ్ ముదిరాజ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. Rathan TATA A Visionary Leader Shaping Philanthropy and Business in India అనే అంశంపై వ్యాసరచన పోటీలు జరుగుతాయని వెల్లడించారు. వివరాలకు 9948882604 నంబర్‌లో సంప్రదించాలని ఆయన పేర్కొన్నారు.

బ్రిడ్జి నిర్మాణానికి పార్టీలకతీతంగా కృషి చేయాలి

ఘట్‌కేసర్‌లో రిలేనిరాహార దీక్ష చేస్తున్న నాయకులకు సంఘీభావం తెలుపుతున్న మాజీ ఎంపీపీ బండారి శ్రీనివాస్‌గౌడ్ తదితరులు

ఘట్‌కేసర్ రూరల్, డిసెంబర్ 18 : ఘట్‌కేసర్‌లో నిలిచిపోయిన బ్రిడ్జి నిర్మాణ పనులను పూర్తి చేయాలని చేస్తున్న నిరాహార దీక్షలో పార్టీలకతీతంగా ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని మాజీ ఎంపీపీ, బీఆర్ఎస్ పట్టణ మున్సిపల్ అధ్యక్షుడు బండారి శ్రీనివాస్‌గౌడ్ కోరారు. ఘట్‌కేసర్ పట్టణ జేఏసీ కన్వీనర్ మారం లక్ష్మారెడ్డి అధ్వర్యంలో చేపట్టిన నిరాహార దీక్షలో నాయకులు వేముల సంజీవగౌడ్, సూర్యనారాయణ, జగన్మోహన్ రెడ్డి, సురేందర్‌రెడ్డి, మహేశ్‌బాబు పాల్గొన్నారు. వారికి మాజీ ఎంపీపీలు బండారి శ్రీనివాస్‌గౌడ్, ఏనుగు సుదర్శన్ రెడ్డి, మండల సహకార సంఘం మాజీ చైర్మన్ శ్రీనివాస్‌గౌడ్, డైరెక్టర్ రేసు లక్ష్మారెడ్డి, మాజీ ఎంపీటీసీ నర్సింగ్‌రావు, ఎర్రోళ్ల సత్తిలు పూలమాలలు వేసి సంఘీభావం తెలిపారు. ఘట్‌కేసర్‌లో బ్రిడ్జి నిర్మాణం పూర్తి కాకపోవటంతో శివారు ప్రాంతాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు చెప్పారు. ఈ విషయంలో కాంగ్రెస్ నాయకులు తమకేమీ పట్టనట్లు వ్యవహరించటం సమంజసం కాదన్నారు. ఇకనైనా భాగస్వాములు కావాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ సోషల్ మీడియా జిల్లా కన్వీనర్ ఎండీ సిరాజ్, జేఏసీ సభ్యులు కమలాకర్, నగేశ్, డాక్టర్ జంగయ్య, విక్రంరెడ్డి, నాయకులు జ్ఞానేశ్వర్, అర్జున్,యాదగిరి, కృపానిధి, అంజయ్యచారి, సాయి, శ్రావణ్‌గౌడ్, నర్సింగ్ రావు, జహంగీర్ తదితరులు పాల్గొన్నారు.

పార్కు స్థలాన్ని కాపాడండి..

మల్కాజిగిరి, డిసెంబర్ 18: పార్కు స్థలాన్ని కబ్జా నుంచి కాపాడాలని పలువురు నాయకులు బుధవారం అల్వాల్ సర్కిల్ డీసీకి వినతిపత్రం అందజేశారు. సాయిసూర్య ఎన్‌క్లేవ్, ఏకలవ్యనగర్, వెంకన్న కాలనీ సరిహద్దులోని పార్కు స్థలాన్ని కబ్జా నుంచి కాపాడాలని ఆయా కాలనీల నాయకులు కోరారు. కార్యక్రమంలో సందీప్‌రెడ్డి, శశిధర్‌రెడ్డి, రవీందర్, ప్రభాకర్, మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గోమాత, భూమాత పరిరక్షణకు పాదయాత్ర

- పర్యావరణ ప్రేమికుడు బాలకృష్ణ గురుస్వామి

మేడ్చల్‌లో బాలకృష్ణ గురుస్వామికి స్వాగతం పలుకుతున్న సోమేశకుర్మ

మేడ్చల్, డిసెంబర్ 18 : గోమాత, భూమాత, పర్యావరణ పరిరక్షణకు కాశ్మీర్ నుంచి కన్యకుమారి వరకు పాదయాత్ర చేపట్టినట్టు నగరంలోని సైదాబాద్ లక్ష్మీనగర్‌కు చెందిన పర్యావరణ ప్రేమికుడు బాలకృష్ణ గురుస్వామి తెలిపారు. బాలకృష్ణ గురుస్వామి చేపట్టిన చేపట్టిన పాదయాత్ర బుధవారం సాయంత్రానికి మేడ్చల్ పట్టణానికి చేరుకుంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 4,900 కిలో మీటర్ల పాదయాత్రను కాశ్మీర్‌లోని లాల్‌చౌక్ వద్ద ప్రారంభించానన్నారు. 14 రాష్ట్రాల మీదుగా ఈ పాదయాత్ర జరుగుతుందని, 83వ రోజుకు చేరుకుందని, 2600 కిలోమీటర్లు పూర్తయినట్లు తెలిపారు. భూమిలో ఆరోగ్యకర ఉత్పత్తులు పండటం లేదని, దాంతో ప్రజలు ప్రాణాంతక రోగాల బారిన పడుతున్నారన్నారు. సంప్రదాయ గో ఆధారిత పంటల సాగును మానేయడం వల్ల భూమిలో సూక్ష్మ పోషకాలు పూర్తిగా నశించి పోయాయన్నారు. భూ సారవంతం కేవలం గో మూత్రం, పేడ వల్లనే సాధ్యపడుతుందన్నారు. ఈ విషయంపై ప్రజల్లో చైతన్యం తీసుకువచ్చేందుకు తాను పాదయాత్రకు పూనుకున్నట్టు చెప్పారు. గో ఆధారిత వ్యవసాయాన్ని ప్రోత్సహించాలని, గో రక్షణకు చట్టాలు కఠినంగా అమలు చేయాలని కేంద్ర మంత్రులు అమిత్‌షా, నితిన్ గడ్కరీలను కలిసి వినతి పత్రం సమర్పించినట్లు ఆయన తెలిపారు. బాలకృష్ణ గురుస్వామి పాదయాత్రకు మండలంలోని పూడూరుకు చెందిన సోమేశ కుర్మ తదితరులు ఘనస్వాగతం పలికి, తగిన పరిచర్యలు చేశారు.

అన్ని కాలనీల్లో అభివృద్ధి పనులు పూర్తి చేస్తాం..

నాగారం 10వ వార్డు సింహపురి కాలనీలో అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్మన్ కౌకుంట్ల చంద్రారెడ్డి

మేడ్చల్ కలెక్టరేట్, డిసెంబర్18 : ప్రతి కాలనీలో అభివృద్ధి పనులను పూర్తి చేస్తామని నాగారం మున్సిపల్ చైర్మన్ కౌకుంట్ల చంద్రారెడ్డి అన్నారు. మున్సిపాలిటీ 10వ వార్డు సింహపురి కాలనీలో రూ. 20 లక్షలతో చేపట్టిన అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పనులను బుధవారం చైర్మన్ ప్రారంభించి మాట్లాడారు. మున్సిపాలిటీలో ఉన్న 20 వార్డుల్లో ప్రజలకు అవసరమైన వసతులు కల్పిస్తున్నామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్‌చైర్మన్ మల్లేశ్, కౌన్సిలర్ కొట్టె దివ్య, నాయకుడు దయాకర్‌రావు, కాలనీవాసులు పాల్గొన్నారు.

పాఠశాలలో మధ్యాహ్న భోజనం పరిశీలన

అన్నోజిగూడ జడ్పీ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న పోచారం మున్సిపల్ చైర్మన్ కొండల్‌రెడ్డి

ఘట్‌కేసర్, డిసెంబర్ 18 : పోచారం మున్సిపాలిటీ అన్నోజిగూడలోని జిలా పరిషత్ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని బుధవారం మున్సిపల్ చైర్మన్ కొండల్‌రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా మెనూ ప్రకారం భోజనం అందుతున్నదా? అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలో ఎలాంటి సమస్యలు ఉన్నా తన దృష్టికి తీసుకురావాలని వారికి సూచించారు. అనంతరం విద్యార్థులతో కలిసి ఆయన భోజనం చేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు స్వరూపరాణి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

డబిల్‌పూర్ ప్రాథమిక పాఠశాలలో అభివృద్ధి పనులు

మేడ్చల్ రూరల్, డిసెంబర్ 18: మేడ్చల్ మండలం డబిల్‌పూర్ గ్రామ ప్రాథమిక పాఠశాల అభివృద్ధికి అడ్వంటా కంపెనీ రూ 9 లక్షల సీఎస్ఆర్ నిధులు మంజూరు చేసింది. దాంతో బుధవారం పాఠశాలలో ఫ్లోరింగ్ టైల్స్ నిర్మాణ పనులను ప్రారం భించారు. పేద విద్యార్థుల కోసం తమ కంపె నీ సీఎస్ఆర్ నిధులను అందజేస్తున్నదని అడ్వంటా కంపెనీ ప్రతినిధులు తెలిపారు. మాజీ ఎంపీపీ రజితా రాజమల్లారెడ్డి, మాజీ సర్పంచ్ గీతా భాగ్యరెడ్డి తదితరులు పాఠశాల అభివృద్ధికి అడ్వంటా కంపెనీ అందించిన సహకాచం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకుడు భాగ్య రెడ్డి, గౌస్, శ్రీనివాస్, కంపెనీ ప్రతినిధులు వెంకటరఘురామ్, రణిత, పరమేశ్, సతీశ్, శశిశేఖర్, సోమనాథ్ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత శిక్షణ తరగతులు ప్రారంభం

నేరేడ్‌మెట్, డిసెంబర్ 18 : వినాయకనగర్ డివిజన్ కమ్యూనిటీ హాల్‌లో కాన్ఫెడరేషన్ ఆఫ్ ఉమెన్ ఎంటర్‌ప్రెన్యూర్స్(కోవే) ఆధ్వర్యంలో ఎంఎస్ఎంఈ సహకారంతో ఏర్పాటు చేసిన ఉచిత శిక్షణ తరగతులను బుధవారం కార్పొరేటర్ క్యాసం రాజ్యలక్ష్మి ప్రారంభించారు. ఈ సంస్థ ద్వారా ఇప్పటివరకు 300 మంది శిక్షణ తీసుకున్నట్లు ఎంఎస్ఎంఈ అసిస్టెంట్ డైరెక్టర్ సుమతి తెలిపారు. ఉచిత శిక్షణ తరగతులను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో కోవే సంస్థ వైస్ ప్రెసిడెంట్ కల్పన, కోఆర్డినేటర్ శాంతితోపాటు ఇతర సభ్యులు పాల్గొన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు ఓంప్రకాశ్, సుశీల, గోపాలకృష్ణ, నరసింగరావు, గోపాల్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

సైన్స్ టాలెంట్ టెస్ట్‌లో విద్యార్థిని ప్రతిభ

మేడ్చల్, డిసెంబర్ 18 : జిల్లా స్థాయిలో జరిగిన బయోలాజిక్ సైన్స్ టాలెంట్ టెస్ట్‌లో మేడ్చల్ మండలం మునీరాబాద్ విద్యార్థిని ప్రతిభ చూపింది. బుధవారం కూకట్‌పల్లి జిల్లా పరిషత్ పాఠశాలలో జిల్లా స్థాయి టాలెంట్ టెస్ట్ జరిగింది. ఈ పరీక్షకు జిల్లాలోని 13 మండలాలకు చెందిన విద్యార్థులు హాజరు కాగా మునీరాబాద్ జడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన శివచందన ద్వితీయ స్థానం సాధించింది. పరీక్ష అనంతరం విద్యార్థినికి సర్టిఫికెట్‌ను అందజేశారు. ఈ సందర్భంగా టీబీఎస్‌టీ మండలాధ్యక్షుడు సంజీవరెడ్డి, ప్రధానోపాధ్యాయుడు గోపాల్, పాఠశాల ఉపాధ్యాయులు శివచందనను అభినందించారు.

అనుమానాస్పద స్థితిలో నవ వధువు మృతి

జవహర్‌నగర్, డిసెంబర్ 18: అనుమానాస్పదస్థితిలో నవ వధువు మృతి చెందిన ఘటన జవహర్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధి యాప్రాల్‌లో చోటుచేసుకుంది. ఎస్‌హెచ్‌వో సైదయ్య తెలిపిన వివరాల ప్రకారం... యాప్రాల్ పరిధిలోని శ్రీదేవినగర్‌లో నేపాల్‌కు చెందిన ప్రకాశ్ విశ్వకర్మ, దుర్గ నివాసముంటున్నారు. ప్రకాశ్ వాచ్‌మెన్‌గా పనిచేస్తుండగా, దుర్గ ఇండ్లల్లో పనిచేస్తూ జీవనం సాగిస్తున్నారు.

నేపాల్‌కు చెందిన ప్రకాశ్ విశ్వకర్మ, దుర్గ ఇద్దరు ప్రేమించుకుని 6 నెలల క్రితం హైదరాబాద్‌కు వలస వచ్చి ప్రేమ వివాహం చేసుకుని యాప్రాల్‌లో ఉంటున్నారు. ఈ నెల 17న దుర్గ పనికి వెళ్ళి వచ్చి భోజనం చేసి పడుకోగా...పని నుంచి ఇంటికి వచ్చిన భర్త ప్రకాశ్ దుర్గను లేపడానికి ప్రయత్నించగా చలనం లేకుండా పడి ఉన్నది. వెంటనే 108కు ఫోన్ చేయగా వచ్చిన అంబులెన్స్ సిబ్బంది దుర్గ(18)ను పరీక్షించగా స్పృహ లేదని చెప్పారు. దగ్గరలోని ప్రైవేటు హాస్పిటల్‌కు తరలించగా పరీక్షించిన డాక్టర్లు అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. దుర్గ మృతిపై అనుమానం ఉన్నదని మృతురాలి కుటుంబసభ్యులు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు జరుపుతున్నారు.

భక్తిశ్రద్ధలతో క్రిస్మస్ వేడుకలు

- పాల్గొన్న నాయకులు, ప్రజాప్రతినిధులు, విద్యార్థులు

ఘట్‌కేసర్‌లో ప్రార్థనలు చేస్తున్న మున్సిపల్ వైస్‌పర్సన్ పావనీజంగయ్యయాదవ్ తదితరులు

ఘట్‌కేసర్ రూరల్, డిసెంబర్ 18 : ఘట్‌కేసర్‌లో బుధవారం క్రైస్తవ సోదరులు క్రిస్మస్ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. పట్టణంలోని నారాయణ గార్డెన్‌లో నిర్వహించిన ఈ వేడుకల్లో క్రీస్తు కీర్తనలను ఆలపించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. మహానీయుని మహిమలను వివరించారు. చర్చి ఫాదర్ ఏసు జీవిత చరిత్రను వివరించగా మహిళలు గీతాలను ఆలపించారు. అనంతరం కేక్ కట్ చేసి పంపిణీ చేశారు. ఘట్‌కేసర్ మున్సిపల్ చైర్‌పర్సన్ పావనీజంగయ్యయాదవ్, మేడ్చల్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి తోటకూర వజ్రేశ్‌యాదవ్, బి బ్లాక్ అధ్యక్షుడు వేముల మహేశ్‌గౌడ్, తహసీల్దార్ రజినీ, కౌన్సిలర్లు కొమ్మిడి అనురాధ, సల్లూరి నాగజ్యోతి, నాయకులు ముత్యాలు యాదవ్, రాధాకృష్ణ, చర్చిల ఫాదర్స్, క్రైస్తవులు పాల్గొన్నారు.

శామీర్‌పేటలోని మహిళా గురుకుల డిగ్రీ కళాశాలలో క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్న విద్యార్థులు

శామీర్‌పేటలో..

శామీర్‌పేట : ఉమ్మడి శామీర్‌పేట మండలంలో బుధవారం క్రిస్మస్ వేడుకలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. శామీర్‌పేటలోని జగద్గిరిగుట్ట తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాలలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ చేతన, అకాడమీ వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ప్రవంతి ఆధ్వర్యంలో విద్యార్థులు సెమీ క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినులు నిర్వహించిన ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. అనంతరం శామీర్‌పేట హుషాన్న మినిస్ట్రీస్ పాస్టర్ రాజు, ఆనంద్, పీటర్ ఆధ్వర్యంలో క్రిస్మస్ ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

మంత్రి కోమటిరెడ్డికి వినతి

ఘట్‌కేసర్ రూరల్, డిసెంబర్ 18 : ఘట్‌కేసర్‌లో రైల్వే బ్రిడ్జి పూర్తికి నిధులు మంజూరు చేయాలని రాష్ట్ర రోడ్డు భవనాలశాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డికి ఘట్‌కేసర్ మున్సిపల్ చైర్‌పర్సన్ పావనీజంగయ్యయాదవ్ బుధవారం వినతిపత్రం అందజేశారు. పట్టణంలో గత 13 ఏండ్లుగా బ్రిడ్జి నిర్మాణ పనులు పెండింగ్‌లో ఉన్నాయని, గత సంవత్సరం కొంత పూర్తి చేసి నిధులు మంజూరు కావడం లేదని కంట్రాక్టర్ పనులు నిలిపివేసినట్లు పేర్కొన్నారు. దీంతో పట్టణంలో వాహనాల రాకపోకలు పూర్తిగా నిలిచిపోయినట్లు పేర్కొన్నారు. నాయకులు ముత్యాలు యాదవ్, దేవేందేర్ ముదిరాజ్, నర్సింగ్‌రావు తదితరులు ఉన్నారు.

క్రీడాకారులకు టీ షర్ట్స్ అందజేత

శామీర్‌పేట, డిసెంబర్ 18: గ్రామీణ ప్రాంతాల నుంచి ఉత్తమ క్రీడాకారులను తీర్చిదిద్దవచ్చునని ఉద్దెమర్రి మాజీ వార్డు సభ్యుడు నవీన్‌కుమార్ అన్నారు. మూడుచింతలపల్లి మండల కబడ్డీ జట్టుకు బుధవారం ఆయన ఉచితంగా టీ షర్ట్స్‌లను అందజేసి మాట్లాడారు. క్రీడల్లో ఉత్తమ ప్రతిభను కనబరిచి జిల్లా, రాష్ట్రానికి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. మాజీ వార్డు సభ్యులు శ్రీనివాస్‌రెడ్డి, మధుసూదన్ యాదవ్, పీఈటీలు గోపాల్‌చారి, రాజేశ్, క్రీడాకారులు పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ అపహరణ

కీసర, డిసెంబర్ 18; హెల్మెట్ ధరించిన ఓ వ్యక్తి తెలివిగా ఇంట్లో భద్రపరిచిన ట్రాన్స్‌ఫార్మర్‌ను అపహరించుకుపోయాడు. కీసర పోలీసుల కథనం ప్రకారం... కీసర మండలం నాగారం మున్సిపాలిటీ ఎస్వీనగర్‌లో నివాసం ఉంటున్న ఎలక్ట్రికల్ వ్యాపారి పుట్టయ్య మినీ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఇంట్లో భద్రపరిచాడు. హెల్మెట్ ధరించి బైక్‌పై వచ్చిన ఓ వ్యక్తి పుట్ట య్య ఇంట్లోని మినీ ఎలక్ట్రికల్ ట్రాన్స్‌ఫార్మర్‌ను చోరీ చేశాడు. సీసీ కెమెరాలను తప్పించుకోనేందుకు హెల్మెట్ ధరించి చోరీకి పాల్పడ్డాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు జరుపుతున్నారు.

మెప్మా ఆర్పీల సమస్యలను పరిష్కరించండి

మేడ్చల్ కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహిస్తున్న మెప్మా ఆర్పీలు, సీఐటీయూ నాయకులు

మేడ్చల్ కలెక్టరేట్, డిసెంబర్ 18 : మెప్మా ఆర్పీల సమస్యలను పరిష్కరించకపోతే రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన చేపడతామని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఎర్ర అశోక్ డిమాండ్ చేశారు. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టరేట్ వద్ద సీఐటీయూ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు మెప్మా ఆర్పీల సమస్యలు పరిష్కరించాలని ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం మెప్మా ఆర్పీలతో అనేక రకాల పనులు చేయించి నెలకు రూ. 6 వేల వేతనం ఇచ్చి చేతులు దులుపుకోవడం దారుణమన్నారు. జీవో 60 ప్రకారం కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, రూ.10 లక్షల సాధారణ బీమా సౌకర్యం కల్పించి, ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. ధర్నాలో సీఐటీయూ నాయకులు, మెప్మా ఆర్పీలు పాల్గొన్నారు.

మెప్మా ఆర్పీల జిల్లా అధ్యక్షురాలిగా బాలమణి

మెప్మా ఆర్పీల మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా అధ్యక్షురాలిగా ఎన్.బాలమణిని బుధవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యదర్శిగా నంద, ఉపాధ్యక్షుడు ఎం.లక్ష్మి, వి.కవిత, సహాయ కార్యదర